www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 20 మార్చి 2024



రబీ సాగునీటికి ఇబ్బంది లేదు

గోదావరి డెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజినీర్ ఆర్.సతీష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు

గోదావరి డెల్టా సిస్టమ్ పరిధిలో ఉమ్మడి తూర్పుగోదావరి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో రబీ పంట కాలానికి సాగునీటికి ఎటువంటి ఇబ్బందీ లేదని గోదావరి డెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజినీర్ ఆర్.సతీష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరి నదిలో నీటి లభ్యత ప్రస్తుతం సమృద్ధిగా ఉందని పేర్కొన్నారు. గోదావరి జిల్లాల పరిధిలో సాగు, తాగునీటికి ఏదైనా ఇబ్బంది ఏర్పడితే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్, ఇరిగేషన్ సర్కిల్, ఏలూరు ఫోన్ నెంబర్ 9701375830, చీఫ్ ఇంజినీర్ గోదావరి డెల్టా సిస్టమ్ ధవళేశ్వరం ఫోన్: 9652536333లను సంప్రదించాలని సతీష్ కుమార్ సూచించారు.

పోలీస్ శాఖ రూటే వేరు..!


- 'పది' పరీక్షల బందోబస్తు విధుల్లో మహిళా పోలీసులు
- డిజిపి ఆదేశాలు రెండు జిల్లాల్లోని అధికారులు బేఖాతరు
- ఎన్నికల విధులు కేటాయించేందుకు ముందస్తు ఎత్తుగడా అంటూ చర్చ
- డ్యూటీ పాస్ లేకుండా పరీక్షా కేంద్రాల వద్ద మహిళా పోలీసులు



ఏలూరుపాడులో పరీక్షా కేంద్రం వద్ద విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీస్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వ చట్టాలను అమలు చేయడం, కోర్టు ఆదేశాలను తుచా తప్పకుండా పాటిస్తూ ప్రజలకు మార్గదర్శకంగా ఉండాల్సిన పోలీస్ శాఖ తన రూటే సెపరేటుగా వ్యవహరిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని పోలీస్ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. మహిళా పోలీసుల విధులకు సంబంధించి కోర్టులో ప్రభుత్వం వేసిన అఫిడవిట్‌ను పట్టించుకోకుండా, రాష్ట్ర డిజిపి ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేస్తూ సచివాలయ ఉద్యోగులైన మహిళా సంరక్షణ కార్యదర్శులకు (మహిళా పోలీసులకు) 'పది' పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు విధులు కేటాయించడం గమనార్హం. ఈ నెల 18వ తేదీ నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఏలూరు జిల్లాలో 139, పశ్చిమగోదావరి జిల్లాలో 127 కేంద్రాల్లో 'పది' పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులను బందోబస్తుగా నియమిస్తారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 'పది' పరీక్షా కేంద్రాల వద్ద మహిళా పోలీసులు విధులు నిర్వహిస్తుండటం గమనార్హం. ఉంగుటూరు నియోజకవర్గంలో గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు, కాళ్ల మండలం ఏలూరుపాడు, పాలకొల్లు మండలం ఇలా దాదాపుగా అత్యధిక కేంద్రాల వద్ద మహిళా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి రెండు గంటల వరకూ పరీక్షా కేంద్రాల వద్ద విధులు, తర్వాత సచివాలయంలో విధులు నిర్వహించాల్సి రావడంతో మహిళా పోలీసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహిళా పోలీసులకు 'పది' పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు విధులు కేటాయించడం నిబంధనలకు పూర్తి విరుద్ధం. అయినప్పటికీ జిల్లాలోని పోలీసు అధికారులు ఇవేమీ పట్టించుకోకుండా చట్టాలతో పని లేకుండా తమకు నచ్చిన విధంగా వ్యవహరిస్తూ మహిళా పోలీసులపై జులుం ప్రదర్శిస్తున్న పరిస్థితి ఉంది. ఇది జిల్లా పోలీస్ అధికారుల ఆదేశాలతో జరిగిందా.. లేక కిందిస్థాయిలో సిఐ, ఎస్ఐలే అత్యుత్సాహంతో మహిళా పోలీసులకు విధులు కేటాయించారా అనేది తెలియరావాల్సి ఉంది.



Rc.No.16/C3/MP/2023

Office of the Director General of Police, A.P., Mangalagiri.

Date: 21.07.2023.

MEMO

Sub:-AP Police – Mahila Police – Certain instructions - Regarding.

*****

Mahila Police is a functionary in Village/Ward Secretariat to address the issues pertaining to Safety of Women and Children in convergence with other line departments. They are not meant for maintenance of Law & Order and other regular Police functions like bandobust duties, receptionists etc. Further, needless to mention that their job chart does not involve frequent visits to the jurisdiction police station.

All the unit officers are therefore instructed not to deploy them for the above duties at any cost. Any deviation in this regard will be viewed seriously and the erred officers will be dealt with disciplinary action.

The Range IsG/DIsG are requested to monitor closely and ensure compliance.

Director General of Police

2023 జులై 21న మహిళా పోలీసులకు పోలీస్ విధులు కేటాయించొద్దంటూ డిజిపి జిల్లా పోలీస్ అధికారులకు పంపిన ఉత్తర్వుల కాపీ

డిజిపి ఆదేశాలే పట్టించుకోరా..!

వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో 11 రకాల పోస్టులకు సంబంధించి ఉద్యోగులను నియమించింది. అందులో మహిళా సంరక్షణ కార్యదర్శులు (మహిళా పోలీసులు) ఒకభాగం. తొలుత శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వీరు పని చేయాలని తెలిపారు. తర్వాత పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పనిచేసేలా మార్పుచేసి పోలీస్ విధులు కేటాయించడం ప్రారంభించారు. మహిళా సంరక్షణ కార్యదర్శులకు పోలీసు ఉద్యోగుల తరహాలో బందోబస్తు విధులతోపాటు, పోలీస్‌స్టేషన్‌లో రిసెప్షన్ విధులు అనేకం వేసేవారు. దీనిపై కొంతమంది ఉద్యోగులు కోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ విచారణ అనంతరం కోర్టు తప్పుబట్టడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గి మహిళా పోలీసులకు పోలీస్ విధులు కేటాయించబోమంటూ కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. వెంటనే మహిళా పోలీసులకు పోలీస్ విధులు కేటాయించొద్దంటూ, నిబంధనలు అతిక్రమించిన పోలీస్ అధికారులపై కఠిన చర్యలు తప్పవని 2023 జులై 21న జిల్లా ఎస్‌పిలు అందరికీ డిజిపి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆదేశాలు వెలువడిన తర్వాత రోజు జిల్లా ఎస్‌పిలు సైతం డిఎస్‌పి, సిఐ, ఎస్‌ఐలకు మహిళా పోలీసులకు విధులు కేటాయించొద్దని, ఆదేశాలు ధిక్కరిస్తే చర్యలు తప్పవంటూ ఆదేశాలిచ్చారు. అప్పటి నుంచి మహిళా పోలీసులకు పోలీస్ విధులు కేటాయించడం నిలిచింది. మళ్లీ నిబంధనలను అతిక్రమిస్తూ రెండు జిల్లాల్లోని పోలీస్ అధికారులు మహిళా పోలీసులకు బందోబస్తు విధులు కేటాయిస్తున్నారు. అంగన్‌వాడీల సమ్మె సందర్భంగా కొన్నిచోట్ల మహిళా పోలీసులను బందోబస్తుకు ఉపయోగించారు. ఎవరూ మాట్లాడకపోవడంతో ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద పలుచోట్ల విధులు కేటాయించారు. ఇప్పుడు దాదాపు అన్ని పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు విధులు కేటాయించారు. ఎక్కడైనా మహిళా పోలీసులు ప్రశ్నిస్తే ఎంపిడిఒల ద్వారా ఒత్తిడి తెచ్చి మరీ విధులు కేటాయించడమే కాకుండా, మహిళా పోలీస్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. మహిళా పోలీసులకు పోలీస్ విధులు కేటాయించడంపై రెండు జిల్లాల పోలీస్ అధికారులు ఏవిధంగా స్పందిస్తారో వేచిచూడాలి.

నిబంధనలను అతిక్రమిస్తున్న విద్యాశాఖ అధికారులు..

'పది' పరీక్షా కేంద్రాల వద్ద విధులు కేటాయించిన ప్రతిశాఖకు సంబంధించిన సిబ్బంది నుంచి డ్యూటీ ఆర్డర్‌తోపాటు, అటెండెన్స్‌ను పరీక్షా కేంద్రాల వద్ద ఉన్న విద్యాశాఖాధికారి తీసుకోవాలి. మహిళా పోలీసుల విధులకు సంబంధించి అధికారికంగా డ్యూటీ ఆర్డర్ ఇవ్వడం లేదని తెలిసింది. డ్యూటీ ఆర్డర్ లేని మహిళా పోలీసులను ఏవిధంగా విధులకు అనుమతిస్తున్నారో విద్యాశాఖ అధికారులు చెప్పాల్సి ఉంది. విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసుల వద్ద అటెండెన్స్ తీసుకుంటున్నారో లేదో కూడా చెప్పాలి. నిబంధనలను అతిక్రమిస్తున్న విద్యాశాఖ అధికారులు సైతం దోషులుగా నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడనుందనే చర్చ నడుస్తోంది.

గురువులు గగ్గోలు..!

ఒకపక్క పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు.. మరోపక్క ఎన్నికల కమిషన్ హుకుంతో ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ అమలు ఉపాధ్యాయుల మెడపై కత్తిలా మారింది. విద్యార్థులకు అందిస్తున్న చిక్కీలపై జగన్ ఫొటోతో ముద్రించిన కవర్‌ను తొలగించడంతోపాటు పుస్తకాలపై ఉన్న జగన్ ఫొటోలు కన్పించకుండా అట్టలు వేయించాలని విద్యాశాఖ ఆదేశాలిచ్చింది. చివరకు విద్యార్థులు బెల్టు ధరించకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేసింది. దీంతో ఉపాధ్యాయుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

- ఎన్నికల కోడ్ అమలులో ఉపాధ్యాయుల మెడపై కత్తి
- చిక్కీలపై జగనన్న కవర్ తొలగింపుతోపాటు పుస్తకాలకు అట్టలేయించే బాధ్యత ఉపాధ్యాయులదేనని ఆదేశం
- విద్యార్థులు బెల్టులు సైతం పెట్టుకోకుండా చర్యలు చేపట్టాలని హుకుం
- ఆందోళనలో ఉపాధ్యాయులు



ప్రజాశక్తి - భీమవరం

విద్యారంగంలో సమూలమైన మార్పులు తీసుకొచ్చామని చెబుతున్న ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి చేపట్టిన చర్యల్లో ఎక్కువ ప్రభుత్వ ప్రచారానికి వినియోగించుకుంది. అదే ఇప్పుడు ఉపాధ్యాయులకు గుదిబండగా మారింది. విద్యార్థులకు అందించే చిక్కీలు, చదువుకునే పుస్తకాలు, ట్యాబ్‌లు, స్కూల్ బ్యాగ్‌లు, బెల్టులు వంటి వాటిపై సిఎం జగన్ ఫొటో ముద్రించి అందించారు. గత ఐదేళ్లుగా ఇదే పరిస్థితి. ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ రావడం, కోడ్ అమలులోకి రావడం చకచకా జరిగిపోయాయి. జిల్లా అధికార యంత్రాంగం కోడ్ అమలుపై పటిష్టమైన చర్యలు చేపట్టింది. వివిధ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగులు, రాజకీయ నేతల విగ్రహాలకు, ప్రభుత్వ శిలాఫలకాలకు ముసుగులు వేయడం వంటి చర్యలను ముమ్మరం చేసింది. అయితే విద్యార్థులకు అందిస్తున్న చిక్కీలు, అందించిన విద్యా సామగ్రిపై సర్వత్రా చర్చ జరుగుతున్న నేపథ్యంలో విద్యా సామగ్రిపై ఉన్న జగన్ ఫొటోను తొలగించాలని పాఠశాల విద్యాశాఖకు ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో విద్యాశాఖ జారీ చేసిన ఆదేశాలు ఉపాధ్యాయులకు తలనొప్పిగా మారాయి. విద్యార్థులకు ఇచ్చిన బెల్టు, బ్యాగులపై 'జగనన్న విద్యాకానుక' అని రాశారు. దీంతో ఆ బెల్టులు ధరించకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై పడింది. బ్యాగులపైనా ఇదే విధంగా ఉందని, వీటిపై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో తెలియడం లేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. పిల్లలకు మధ్యాహ్న భోజనంలో భాగంగా ఇస్తున్న చిక్కీలపై ఉండే కవర్లపైనా సిఎం జగన్ ఫొటోను ముద్రించారు. ఇప్పటికే చాలా పాఠశాలలకు వీటిని పంపిణీ చేశారు. పాఠశాలల్లో చిక్కీల నిల్వలు 15 రోజుల వరకు ఉంటున్నాయి. పిల్లలకు అందిస్తున్న కోడిగుడ్లపైనా 'జగనన్న గోరు ముద్ద' అని స్టాంపులు వేశారు. ఇప్పుడు ఇవి పాఠశాలల్లోనే ఉన్నాయి. ఎన్నికల కోడ్ రావడంతో వీటిని ఏం చేయాలని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. బైజూస్ కంటెంట్‌తో విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌లపైనా జగన్ ఫొటో ముద్రించారు. వీటిపై వేసిన స్టిక్కర్లనూ తొలగించడం లేదు. ఉపాధ్యాయులు వీటిని తొలగించాలా లేదా అనే దానిపై స్పష్టత లేకుండాపోయింది. పాఠశాలల్లో గోడలపై జగనన్న గోరుముద్ద, విద్యాకానుక ఇతరత్రా ఇలాంటి కార్యక్రమాలు, జగన్ ఫొటోలను చాలాచోట్ల పెయింటింగ్ వేశారు. ఇప్పుడు వీటిని మార్చేందుకు రూ.లక్షల్లో ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి. విద్యార్థులకు అందించిన డిక్షనరీలపైనా జగన్ బొమ్మతో నవరత్నాల వివరాలు ముద్రించారు.

ఎన్నికల కమిషన్ ఆదేశం.. ఉపాధ్యాయులు సతమతం

చిక్కీలపై ఉన్న జగన్ ఫొటోతో కూడిన కవర్‌ను తీసేసి చిక్కీలు అందించాలని ఆదేశించారు. చిక్కీల కవర్ తీసేస్తే వాటిని ఎలా నిల్వ చేయాలో అర్థం కాక ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. కవర్ తీసేశాక ఎక్కువ కాలం నిల్వ ఉండే అవకాశం లేదని, బంక కారిపోతున్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పైగా పుస్తకాలకు అట్టలు వేయించాలని, బెల్టులు ధరించకుండా చూడాలని ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే పని భారంతో సతమతమవుతున్న ఉపాధ్యాయులకు ఈ పనులు మరింత భారంగా మారాయి. దీనికి తోడు ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ఎటువంటి చర్యలు తీసుకుంటే ఏ పరిస్థితి ఎదురవుతుందోనని భయాందోళనకు ఉగురవుతున్నారు.

పని ఒత్తిడితో ఉపాధ్యాయులు సతమతం

బి.గోపీమూర్తి, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి



ఎన్నికల కమిషన్ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించడం అభినందనీయం. కోడ్ ఉల్లంఘన లేకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. చిక్కీలపై ఉన్న సిఎం జగన్ ఫొటోతో కూడిన కవర్ తొలగించాలని, పుస్తకాలకు అట్టలు వేయించాలని ఉపాధ్యాయులపై పెట్టిన బాధ్యత గురించి పునరాలోచించాలి. ఉపాధ్యాయులు ఇప్పటికే పని ఒత్తిడితో సతమతమవుతున్నారు. ఓపక్క పరీక్షలు, మరోపక్క ఎన్నికల సమయంలో మరింత భారాన్ని మోపడం సరైంది కాదు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన పేరిట తీసుకునే చర్యలకు ఎక్కడ గురవుతామోనని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

చిక్కీలపై కవర్లు లేకుండా సరఫరా చేయాలి

కెవి.రామచంద్రరావు, ఎస్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు



చిక్కీలపై ఉన్న సిఎం జగన్ ఫొటోతో కూడిన కవర్లు తొలగించి అందించాలని, విద్యార్థులు బెల్టులు ధరించకుండా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు ఎన్నికల కమిషన్ ఆదేశాలిచ్చింది. చిక్కీలపై జగన్ ఫొటోతో కూడిన కవర్ లేకుండా ఏజెన్సీ సరఫరా చేస్తే ఎటువంటి ఇబ్బందీ ఉండదు. విద్యార్థులు బెల్టులు ధరించకుండా చర్యలు చేపట్టాం. పాఠశాలల్లో ప్రభుత్వ ప్రచారాలకు సంబంధించిన వాటిని అన్ని విఆర్ఒ సమక్షంలో తొలగించాం. ఎన్నికల కమిషన్ ఆదేశాలు తూచ తప్పకుండా పాటిస్తున్నాం.

ఎన్నికల కోడ్ పటిష్టంగా అమలు చేయాలి

ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఎంసిసి బృందాలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలి

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని నిష్పక్షపాతంగా మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ రిటర్నింగ్ అధికారులను, సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జెసి బి.లావణ్యవేణితో కలిసి ఎన్నికల అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ ఎక్కడా ఉల్లంఘనలకు ఎక్కడా తావులేకుండా ప్రత్యేక పర్యవేక్షించాలన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనకు సంబంధించి అందిన ఫిర్యాదులపై తక్షణం విచారణ చేసి తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలన్నారు. సి-విజిలెన్స్ ద్వారా అందిన ఫిర్యాదులను పరిశీలించి వాటిని చదివి అందుకు సంబంధించి తీసుకున్న చర్యలను నివేదించాలన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై అందిన ఫిర్యాదులను నియోజకవర్గ స్థాయిలోనే పరిష్కరించాలని, అప్పుడే ప్రజల్లో అధికారులపై మరింత విశ్వాసం పెరుగుతుందని అన్నారు. వివిధ ప్రచార మాధ్యమాల్లో వచ్చే ప్రతికూల వార్తలపై స్పందిస్తూ 24 గంటల్లో వాటిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో పోలీస్ శాఖ ద్వారా ఏర్పాటు చేసిన ఎనిమిది చెక్ పోస్టుల్లో మూడు షిఫ్టుల ద్వారా సిబ్బంది పర్యవేక్షిస్తారన్నారు. దీనికి సంబంధించి సీసీ కెమెరాలను చెక్‌పోస్టుల్లో అమర్చి కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ, ట్రెయినీ కలెక్టర్ టి.శ్రీపూజ, డిఆర్ఒ డి.పుష్పమణి, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ఎన్ఎస్‌కె.ఖాజావలీ, ఎం.ముక్కంటి, కె.అద్దయ్య, వై.భవానిశంకరీ, కె.భాస్కర్, జెడ్‌పి సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావు, డిపిఒ టి.శ్రీనివాస్ విశ్వనాథ్, నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, కలెక్టరేట్ ఎఒ కె.కాశీవిశ్వేశ్వరరావు హాజరయ్యారు.

పెయిడ్ ఆర్టికల్స్‌పై గట్టి నిఘా : జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించకుండా ఎన్నికల రాజకీయ ప్రకటనలు ప్రసారం చేయాలని జాయింట్ కలెక్టర్, జిల్లా అదనపు ఎన్నికల అధికారి బి.లావణ్యవేణి కేబుల్ ఆపరేటర్లకు సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో మంగళవారం త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రసార మాధ్యమాలు, కేబుల్ ఆపరేటర్లు అనుసరించాల్సిన విధి విధానాలను వివరించేందుకు లావణ్యవేణి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లాలోని కేబుల్ ఆపరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లావణ్యవేణి మాట్లాడుతూ ప్రసార మాధ్యమాల్లో ప్రచురితమయ్యే, ప్రసారమయ్యే పెయిడ్ ఆర్టికల్స్‌పై గట్టి నిఘా ఉంటుందని, ఈ విషయంలో ప్రసార మాధ్యమాల ప్రతినిధులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ప్రచార ప్రకటనలు పరిశీలించేందుకు జిల్లాస్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీని నియమించామన్నారు. ఆ కమిటీ అనుమతి పొందిన రాజకీయ ప్రకటనలనే ప్రసారం చేయాలన్నారు. ప్రకటనల్లో కుల, మత, భాషాపరమైన అంశాలు ఉండకూడదన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ ప్రకటనలు ప్రసారం చేస్తే సంబంధిత కేబుల్ ఆపరేటర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎంసిఎంసి అనుమతి లేకుండా చేసే ప్రకటనలు ఎన్నికల నియమావళికి విరుద్ధంగా పరిగణిస్తూ చట్టప్రకారం తగుచర్యలు చేపడతామన్నారు. త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించే విషయంలో మీడియా సహకరించాలని జెసి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎంసిఎంసి సభ్యులు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.బాబ్జి, డిపిఆర్ఒ ఆర్‌విఎస్.రామచంద్రరావు, వి.మధుసూర్య ప్రకాష్, రెహ్మాన్ అలీఖాన్ పాల్గొన్నారు.

రాజకీయ హోర్డింగులను అనుమతించొద్దు

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా

విసిలో పాల్గొన్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, జెసి బి.లావణ్యవేణి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన వాణిజ్య స్థలాల్లో ఎటువంటి రాజకీయ ప్రకటనలు, హోర్డింగులు, పోస్టర్లు, బ్యానర్లను అనుమతించొద్దని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు తీరును అన్ని జిల్లా ఎన్నికల అధికారులతో రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం ఆయన సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్సుకు ఏలూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ, ట్రైనీ కలెక్టర్ టి.శ్రీపూజ, డిఆర్ఒ డి.పుష్పమణి, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ఎన్ఎస్‌కె.ఖాజావలీ, ఎం.ముక్కంటి, కె.అద్దయ్య, వై.భవానిశంకరీ, కె.భాస్కర్, జెడ్‌పి సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావు, జిల్లా పంచాయతీ అధికారి టి.శ్రీనివాస్ విశ్వనాథ్, నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సంబంధించి శిక్షణా కార్యక్రమాలు పూర్తి చేశామన్నారు. నోటిఫికేషన్ విడుదల లోపే పిఒలు తదితరులకు అవసరమైన శిక్షణా కార్యక్రమాలను కూడా నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు వివరించారు. తొలుత రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా మాట్లాడారు. ప్రస్తుతం జాతీయ, ప్రధాన రహదారుల పక్కన ఉన్న హోర్డింగులను అన్ని రాజకీయ పార్టీలకు సమాన ప్రాతిపదికన కేటాయిచాలని, నూతన హోర్డింగులకు అనుమతులను ఏమాత్రం ఇవ్వొద్దని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో రాజకీయ ప్రకటనలు, పోస్టర్లు, హోర్డింగులు, బ్యానర్ల ప్రదర్శన విషయంలో జిల్లా ఎన్నికల అధికారులు ఎంతో అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు విరుద్ధంగా ఎటువంటి రాజకీయ ప్రచారాన్ని అనుమతించొద్దని సూచించారు. ప్రయివేట్ భవనాలపై వాల్‌పెయింట్స్‌కు ఎటువంటి అనుమతి లేదని, ఇప్పటికే ఉన్నవాటిని వెంటనే చెరిపించేయాలన్నారు. ప్రభుత్వ అనుమతితో ప్రయివేట్ భవనాలపై ఇప్పటికే ఉన్న పెద్ద హోర్డింగులు, కటౌట్ల భద్రతను, నిర్మాణ స్థిరత్వాన్ని ఒకసారి పరిశీలించాలని సూచించారు.

హిందీ పరీక్షకు 757 మంది గైర్హాజరు

జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పదో తరగతి పరీక్షలు రెండో రోజు ప్రశాంతంగా జరిగాయని, 757 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పరీక్ష జరిగిందని చెప్పారు. మంగళవారం హిందీ పరీక్షకు 24,209 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 23,452 మంది హాజరయ్యారు. 757 మంది గైర్హాజరయ్యారు. హాజరు 96.87 శాతంగా నమోదైంది. ప్రయివేట్ విద్యార్థులు 1,342 మందికి 423 మంది మాత్రమే హాజరయ్యారు. మిగిలిన 919 మంది గైర్హాజరయ్యారు. వీరి హాజరు శాతం 31.52గా నమోదైంది. ఫ్లయింగ్ స్క్వాడ్ 42 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా స్థాయి అబ్జర్వర్లు ఒక పరీక్ష కేంద్రాన్ని, జిల్లా విద్యాశాఖాధికారి ఆరు పరీక్షా కేంద్రాలను, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఐదు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. వీరంతా కలిసి మొత్తం 54 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని, ఎటువంటి మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడలేదని జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు.



పోలవరం : పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

పోలవరం :మండలంలో రెండో రోజు పదో తరగతి పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని గూటాల జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 101 మంది విద్యార్థులకు 98 మంది విద్యార్థులు హాజరవ్వగా ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 262 మంది విద్యార్థులకు 256 మంది హాజరవ్వగా ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. కార్మెల్ పురం ఆర్‌సిఎం పాఠశాలలో 30 మంది విద్యార్థులకు ఎనిమిది మంది హాజరైనట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. పదో తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఆవరణ వద్ద పోలీసులు విద్యార్థులను తనిఖీలు నిర్వహించి పరీక్షా హాలుకి పంపించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. విద్యార్థులకు తాగునీరు, మౌలిక సదుపాయాలు కల్పించారు.



కలిదిండి : పరీక్ష హాలు బయట విద్యార్థులు

కలిదిండి : మండలంలో పదో తరగతి పరీక్షలకు ఆరు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఇఒ పిడుగు ప్రభాకరబాబు తెలిపారు. ఆరుతెగలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 160 మంది విద్యార్థులకు 141 మంది హాజరవ్వగా 19 మంది గైర్హాజరయ్యారు. కలిదిండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 327 మంది విద్యార్థులకు 323 మంది హాజరవ్వగా నలుగురు గైర్హాజరయ్యారు. కోరుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 267 మందికి 254 హాజరు కాగా 13 మంది గైర్హాజరయ్యారు. భాస్కరరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 139కి 134 మంది హాజరు కాగా ఐదుగురు గైర్హాజరయ్యారు. కలిదిండి శశి హై స్కూల్‌లో 16 మందికి నలుగురు హాజరు కాగా 12 మంది గైర్హాజరయ్యారు. కోరుకొల్లు క్రాంతి హై స్కూల్‌లో 12 మందికి ముగ్గురు హాజరు కాగా తొమ్మిది మంది గైర్హాజరయ్యారు. మొత్తం మండలవ్యాప్తంగా 921 మంది విద్యార్థులకు 859 మంది పరీక్షకు హాజరైనట్లు ఎంఇఒ తెలిపారు.

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు రద్దు

రవాణా శాఖ కార్యాలయం నుంచి ఆదేశాలు

ఉప రవాణా కమిషనర్ శాంతకుమారి

ఏలూరు స్పోర్ట్స్ :రవాణా శాఖలో అవినీతిని నిర్మూలించేందుకు కొత్త శకానికి రవాణా కమిషనర్ నాంది పలికారు. అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సరిహద్దు చెక్‌పోస్టులతో పాటు అన్ని చెక్‌పోస్టులను వాటి సేవలను నిలిపివేస్తూ ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఏలూరు ఉప రవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి తెలిపిన వివరాల ప్రకారం... రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అంతర్రాష్ట్ర సరిహద్దు రవాణా శాఖ చెక్ పోస్టు, సాధారణ చెక్‌పోస్టులను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర రవాణా శాఖ కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగా జిల్లాలో ఉన్న జీలుగుమిల్లి అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును కూడా మూసివేసేందుకు ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఈ సరిహద్దు చెక్‌పోస్టులో నలుగురు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు డ్యూటీలను నిర్వహిస్తున్నారు. నలుగురు హోంగార్డులు కూడా ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. వీరందరిని జిల్లా కార్యాలయానికి అటాచ్‌మెంట్ చేస్తూ జిల్లా ఉపరవాణా కమిషనర్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం వీరి సేవలను ఎన్నికల విధులకు వాడుకోవాలని రాష్ట్ర కార్యాలయం నుంచి ఆదేశాలు వెలువడ్డాయని ఉప రవాణా కమిషనర్ తెలిపారు. ఎన్నికల అనంతరం వీరి సేవలను ఎక్కడ వినియోగించాలనే అంశంపై స్పష్టత వస్తుందన్నారు. అయితే సరిహద్దు చెక్‌పోస్టులో ఉన్న సేవలను నేరుగా ఆన్‌లైన్‌లో చెల్లించేవిధంగా రాష్ట్ర రవాణా కార్యాలయం ఇప్పటికే చర్యలు చేపట్టింది. దీని కోసం ప్రత్యేకంగా యాప్‌ను కూడా రూపొందించింది. సరిహద్దు చెక్‌పోస్టులో చెల్లించే నగదు కార్యకలాపాలన్నిటిని ఈ యాప్ ద్వారా చెల్లించవచ్చు.


సుందర్‌పాల్‌ను అభినందిస్తున్న మోషేన్‌రాజు

మోషేన్‌రాజును కలిసిన సుందర్‌పాల్

ప్రజాశక్తి - కామవరపుకోట

మండలంలోని వీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన దాసి సుందర్‌పాల్(పండు)ను వైసిపి జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమించడం పట్ల ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజును దాసి సుందర్‌పాల్ భీమవరంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి దాసి సుందర్‌పాల్‌కు మోషేన్‌రాజు శాలువా కప్పి అభినందించారు. పార్టీ గెలుపునకు మరింత ఉత్సాహంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వీరిశెట్టిగూడెం మత్స్యకార సొసైటీ ఛైర్మన్ పెనుమాల సంజీవరావు, ఉప్పే ప్రసాద్, జయరాజు, మోషే, చిన్న లాజరు, సంగీతరావు పాల్గొన్నారు.

మానవసేవే మాధవసేవ

మతిస్థిమితం లేని వ్యక్తికి సపర్యాలు చేసిన శ్రీనివాసరావు

ప్రజాశక్తి - కామవరపుకోట


సపర్యాలు చేస్తున్న శ్రీనివాసరావు

గత 15 రోజులుగా కామవరపుకోట బస్టాండ్ సెంటర్‌లో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న వ్యక్తికి సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ అధ్యక్షులు మున్నంగి శ్రీనివాసరావు సపర్యలు చేశారు. బస్టాండ్‌లో పక్క వారికి ఇబ్బంది కలిగిస్తున్న మతిస్థిమితం లేని వ్యక్తి విషయం తెలుసుకున్న శ్రీనివాసరావు స్థానిక బస్టాండ్‌లో సబ్బుతో స్నానం చేయించి నూతన వస్త్రాలు అందించారు. మానవసేవే మాధవసేవగా భావించి ఆ వ్యక్తికి సపర్యలు చేసిన శ్రీనివాసరావును స్థానికులు అభినందించారు.

బిసిలకు అధిక ప్రాధాన్యత

టిడిపి చింతలపూడి ఎంఎల్‌ఎ అభ్యర్థి రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

తెలుగుదేశం పార్టీ బిసిలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, వారికి పెద్దపీట వేస్తుందని టిడిపి చింతలపూడి ఎంఎల్‌ఎ అభ్యర్థి సొంగ రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో నాయీ బ్రాహ్మణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పెర నాగరాజు ఆధ్వర్యంలో వైసిపి నుంచి 20 మంది నాయీ బ్రాహ్మణులు టిడిపిలోకి చేరారు. ఈ సందర్భంగా వారికి ఎఎంసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, మురళీకృష్ణ టిడిపి కండువా కప్పి సాదారంగా పార్టీలోకి ఆహ్వానించారు. భోగోలు గ్రామంలో వైసిపి నుంచి సత్యనారాయణ ఆయన అనుచరులు జనసేనలోకి చేరారు. ఈ సందర్భంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ చిలకలూరిపేట ప్రజాగళం సభలో శాంతి భద్రతల విషయంలో ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కావాలనే ఈ విధంగా చేసిందన్నారు. ఈ సభను చూసి వైసిపికి భయం పట్టుకుందన్నారు. వైసిపి హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమన్నారు. రాష్ట్రాభివృద్ధి కూటమితోనే సాధ్యమన్నారు. తనను చింతలపూడి నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరేరు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేకా ఈశ్వరయ్య, కృష్ణ, వాలి, దాసు పాల్గొన్నారు.

వీరంపాలెంలో రోషన్‌కుమార్ పర్యటన

కామవరపుకోట :మండలంలోని వీరంపాలెం గ్రామంలో టిడిపి చింతలపూడి ఎంఎల్‌ఎ అభ్యర్థి రోషన్‌కుమార్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయాన్ని సందర్శించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రెండు ఆటోలు ఢీకొని ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

రెండు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఆరుగురు మహిళా కూలీలు గాయాలపాలయ్యారు. వారు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బుట్టాయగూడెం రోడ్డులో ఉన్న ఎస్‌ఆర్ పెట్రోల్ బంకు సమీపంలో మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. జంగారెడ్డిగూడెం నుంచి కొయ్యలగూడెం వైపు పైపుల లోడుతో వెళ్తున్న ట్రక్కు ఆటో, మహిళా కూలీలను తీసుకెళ్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పాసింజర్ ఆటోలో ఉన్న ఆరుగురు మహిళా కూలీలు గాయాలపాలయ్యారు. వారిని స్థానికులు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పరిస్థితి విషమించి మహిళ మృతి

ప్రజాశక్తి - ముసునూరు

పాము కాటుకు గురైన మహిళ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కాట్రేనిపాడు గ్రామానికి చెందిన పిన్నిబోయిన వీరయ్య కుమార్తె అంగడాల భవాని(30)కి బాపులంపాడు మండలం వేలేరు గ్రామానికి చెందిన వ్యక్తికి కొన్నేళ్ల క్రితం వివాహమైంది. ఈ క్రమంలో భవాని ఈ నెల 17వ తేదీన తన అత్తగారి గ్రామమైన వేలేరులో సొరకాయ కోతకు వెళ్లింది. సొరకాయలు కోస్తుండగా పాము కాటుకు గురైంది. దీంతో ఆమెను నూజివీడు అమెరికన్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందింది. మాజీ ఎంఎల్‌ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రూ.1.62 లక్షల నగదు స్వాధీనం

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం జాతీయ రహదారి గుండా కారులో తరలిస్తున్న నగదును ఎన్నికల విధుల్లో ఉన్న ఫ్లయింగ్ స్క్వాడ్ స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం కారులో తరలిస్తున్న నగదును అధికారులు తనిఖీ చేసి గుర్తించారు. చించినాడ గ్రామానికి చెందిన ఖండవల్లి ఇందు, సుమన్ దంపతులు ఒక ప్రయివేట్ కారులో రూ.1.62 లక్షలు తీసుకెళ్తుండగా తనిఖీ బృందం గుర్తించారు. నగదుకు సంబంధించి సరైన ఆధారాలు లేకపోవడంతో ఎఎస్‌ఐ వీరభద్రరావు, రీసర్వే డిప్యూటీ తహాశీల్దార్ నాగేశ్వరావులు నగదు స్వాధీనం చేసుకుని తహాశీల్దార్ జె.సుశీలదేవి, టి.విజయసారథి వద్ద హాజరు పరిచారు. కుట్టు మిషన్ కొనుగోలు నిమిత్తం నగదును తీసుకెళ్తున్నామంటూ బాధితులు అధికారుల వద్ద కన్నీటి పర్యంతమయ్యారు. తగిన ధృవపత్రాలు చూపి జిల్లా కేంద్రంలో సీజ్డ్ మోనిటరింగ్ కమిటీ వద్ద సమర్పించి నగదును తిరిగి స్వాధీనం చేసుకోవచ్చని అధికారులు బాధితులకు తెలిపారు. ఎన్నికల నిబంధనలకు తగినంత ప్రచారం లేకపోవడంతో సామాన్య ప్రజలు ఈ విధంగా ఇబ్బందులు పడే అవకాశం ఉందని, నగదు పట్టుకెళ్లే విషయంలో అధికారులు గ్రామాల్లో టాంటాం వేయించి ప్రచారం చేయించాలని పలువురు కోరుతున్నారు.

ఆందోళనలో పొగాకు రైతులు

వర్షాలు పడే అవకాశం ఉందనే సమాచారంతో గుబులు
తడిస్తే సగం ధరే వస్తోందని ఆవేదన
తడవకుండా జాగ్రత్తలు తీసుకుంటున్న వైనం



ప్రజాశక్తి - ముసునూరు

ఆరుగాలం కష్టపడి పంట పండిస్తే వర్షం ప్రభావానికి ఆ పంట తడిస్తే సగానికి సగం ధర వచ్చే పరిస్థితి ఉందని ముసునూరు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుతడి పంటగా పండించే నాటు పొగాకును కోతులతో ఇబ్బంది లేకుండా తక్కువ నీరు అడిగే పంటగా పేర్కొంటారు. రానున్న రెండు, మూడు రోజుల్లో ఝార్ఖండ్ రాష్ట్రం నుంచి కోస్తాంధ్ర వరకు ద్రోణి ప్రభావంతో పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల శాఖ నిర్వహణ సంస్థ, భారత వాతవరణ శాఖ ఇచ్చిన సమాచారం మేరకు వర్షాలు పడే అవకాశం ఉందని చెప్పడంతో రైతులు ఆరపెట్టిన పొగాకు పందిరిలపై పట్టాలు కప్పుతున్నారు. మండలంలోని 16 గ్రామాల్లో సుమారు 855 ఎకరాల్లో పంట సాగు చేయగా 367 ఎకరాల్లో కోతలు కోసి మండిలు పెట్టారు. 488 ఎకరాల్లో కోతలు కోయడానికి సిద్ధంగా ఉన్నాయి. పొగాకు, మొక్కజొన్న, మిర్చి వంటి ఆరుతడి పంటలను సాగు చేసుకునే రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తడిస్తే సగం ధరే వస్తుంది
కౌలు రైతు కంచర్ల సత్యనారయణ, ముసునూరు



నాటు పొగాకు సాగు చేయడానికి ఎకరానికి దుక్కు ఖర్చులు రూ.పది వేలు, నారు కొనుగోలుకు రూ.ఎనిమిది వేలు ఖర్చయింది. నాట్లు వేయడానికి కూలీల ఖర్చు రూ.రెండు వేలు, పంటలో కృత్రిమ ఎరువులకు రూ.ఏడు వేలు, రసాయినిక ఎరువులకు రూ.15 వేలు, క్రిమి సంహారక మందులు పిచికారీ చేయడానికి రూ.మూడు వేలు, కలుపు, పిలక తీయడానికి కూలీల ఖర్చు రూ.ఐదు వేలు, చివర్లలో కోత కోయడానికి 45 మంది కూలీలకు ఒక్కొక్కరికి రూ.650 చొప్పన మొత్తం రూ.29,250 ఖర్చయింది. పొగాకు ఆరపెట్టడానికి పందిరిలపై సిద్ధం చేశాం. కౌలు ఎకరానికి రూ.20 వేలు కట్టి, నీళ్ల కట్టడానికి ఈ ఆరు నెలల పాటు కుటుంబ సభ్యులతో కష్టపడి పండించాం. ఇప్పడు వర్షం పడితే సగానికి సగం ధర పలికే పరిస్థితి ఉంది.

రైతులు అప్రమత్తంగా ఉండాలి
మండల వ్యవసాయాధికారి ఎస్.మధుమోహన్



ఈ ఏడాది నాటు పొగాకు పంట నాటే రబీ సీజన్‌లో వర్షం ప్రభావంతో తోటలను దున్నివేయడం, దిగుబడి తక్కువ రావడంతో రైతుకు పుట్లు 125 కేజీలు రూ.30వేల నుంచి రూ.40 వేల వరకు అత్యధిక ధర ఉంది. ఇప్పుడు వర్షానికి తడిస్తే రైతులు నష్టపోతారు. పొగాకు తడవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రభుత్వాలు రాయితీపై పట్టాలు ఇవ్వడంలేదు. పొగాకు తదితర పంటలు దాచుకోవడానికి గోదాములు లేకపోవడంతో రైతులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నా భర్తను కాపురం చేయడనివ్వడంలేదు

అత్తమామలు, ఆడపడుచుపై చర్యలు తీసుకోవాలి
న్యాయం చేయాలని నిరసనకు దిగిన వివాహిత



న్యాయం చేయాలని అమ్మపాలెంలో నిరసనకు దిగిన దుర్గాభవాని

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

తనకు న్యాయం చేయాలని ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన డొక్కా దుర్గాభవాని జంగారెడ్డిగూడెం మండలం అమ్మపాలెం గ్రామంలో నిరసనకు దిగింది. ఆమె తెలిపిన వివరాల ప్రకారం... అమ్మపాలెం గ్రామానికి చెందిన బొబ్బర రామాంజనేయులుకు, ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన డొక్కా దుర్గాభవానికి 2023లో వివాహమైంది. ఈ క్రమంలో వివాహమైన రెండు నెలల తర్వాత ఆషాఢం రావడంతో దుర్గాభవానిని ఆమె భర్త రామాంజనేయులు జి.కొత్తపల్లిలోని పుట్టింటికి పంపించాడు. అప్పటి నుంచి తనతో తన భర్తను కాపురం చేయకుండా అత్తమామలు, ఆడపడుచు, కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఆమె భర్త కోదండరావు కలిసి అడ్డుపడుతున్నారని దుర్గాభవాని చెప్పింది. రెండు నెలల క్రితం తన భర్త వచ్చి తనను తీసుకెళ్లి అమ్మపాలెం గ్రామంలోనే వేరే ఇంట్లో ఉంటుండగా వారు వచ్చి తన భర్తను తీసుకెళ్లిపోయారని వాపోయింది. తన భర్త ఎక్కడ ఉన్నాడో ఇప్పటికీ తనకు తెలియలేదని, వారు తెలియనివ్వడంలేదని, తన భర్తను కాపురం చేయనివ్వడంలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. లక్కవరం, ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్లలో ఏలూరు దిశ పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెట్టినా తనకు న్యాయం జరగడంలేదన్నారు. నిడమర్రులో పని చేస్తున్న తన ఆడపడుచు భర్త కానిస్టేబుల్ కోదండరావు వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నాడని, దీంతో ఎక్కడికి వెళ్లినా తనకు న్యాయం జరగడంలేదని, ఏ దిక్కు తోచని స్థితిలో నిరసనకు దిగానని వాపోయింది. విషయం తెలుసుకున్న లక్కవరం ఎస్ఐ సుధీర్ ఆమె వద్దకు వచ్చి కాపురానికి అడ్డుపడుతున్న వారిపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని, న్యాయం చేస్తామని చెప్పారు. ఇప్పటికే ఎన్నో సారు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, తనకు న్యాయం జరగలేదని, మళ్లీ ఫిర్యాదు చేసినా న్యాయం జరుగుతుందన్న నమ్మకం తనకు లేదని దుర్గాభవాని చెప్పారు. తనకు న్యాయం జరిగేవరకూ నిరసన కొనసాగిస్తానని చెప్పారు.

నా కాపురం నిలబెట్టండి

కలెక్టరేట్ వద్ద మహిళ ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు సిటీ


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నాగమణి

తన కాపురం నిలబెట్టాలని కోరుతూ ఓ మహిళ ఏలూరు కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా చేసింది. అనంతరం ఎస్‌పికి వినతిపత్రం అందించింది. ఈ సందర్భంగా బాధితురాలు బుట్టాయగూడెం మండలం దేవునివారిగూడెం గ్రామానికి చెందిన నాగమణి మాట్లాడుతూ ఆమె భర్త నాగరాజు కూరం వెంకటరత్నంతో వివాహేతర సంబంధం పెట్టుకుని తనను హింసిస్తున్నాడని వాపోయింది. తనను కొడుతూ శారీరకంగా, మానసికంగా బాధ పెడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. కూరం వెంకటరత్నం, కూరం నాగేంద్ర, తన భర్త ముగ్గురు కలిసి తనపై దాడి చేశారని చెప్పింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తనను చూసేందుకు కూడా తన భర్త రాలేదని వాపోయింది. ఆ ముగ్గురి నుంచి ప్రాణహాని ఉందని, తనకు రక్షణ కల్పించాలని కోరింది. బుట్టాయగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడంలేదని చెప్పింది. స్టేషన్‌లో అందరిని కొనేశానని, ఎవరికి చెప్పినా నాకేమి భయం లేదని తన భర్త చెబుతున్నాడని తెలిపింది. నిందితులను అరెస్టు చేసి తనకు రక్షణ కల్పించాలని కోరింది. తన భర్త తనకు కావాలని, తన కాపురం నిలబెట్టాలని కోరారు.



మాట్లాడుతున్న పోలీసు అధికారులు


అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు

ప్రజాశక్తి - ఏలూరు

అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని పోలీసుఅధికారులు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న పోలీసు అధికారులు మంగళవారం నిర్వహించారు. సరిహద్దు ప్రాంతాల్లో అధికారులందరూ ఎన్నికల నేపథ్యంలో ఒక రాష్ట్రం నుంచి వేరే రాష్ట్రాల ప్రాంతాలకు ఎన్నికల సందర్భంగా అక్రమ రవాణాను అరికట్టే నిమిత్తంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అంతర్రాష్ట్ర అంతర్‌జిల్లాల చెక్ పోస్టుల వద్ద తనిఖీలు నిర్వహించే విషయాల్లో, ఉభయ రాష్ట్రాల అధికారులు సమాచారాన్ని మార్పిడి చేసుకునే అంశాలపై ఒకరికొకరు సహకరించుకోవాలన్నారు. ఈ సమావేశంలో జంగారెడ్డిగూడెం డిఎస్‌పి యు.రవిచంద్ర, పోలవరం డిఎస్‌పి ఆర్.సతీష్‌కుమార్, నూజివీడు డిఎస్‌పి జి.లక్ష్మయ్య, పాలవంచ డిఎస్‌పి ఎన్.సురేష్‌కుమార్‌రెడ్డి, సత్తుపల్లి ఎసిపిఎ రఘు, చింతలపూడి సిఐ సుధాకర్, జంగారెడ్డిగూడెం సిఐ రాజేష్, నూజివీడు రూరల్ సిఐ రామకృష్ణ, సత్తుపల్లి సిఐ, అశ్వారావుపేట సిఐ పాల్గొన్నారు.

పోలీసు శాఖ సేవా పతకానికి కేశవరావు ఎంపిక

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్


కేశవరావు

ప్రస్తుతం గన్నవరం ట్రాఫిక్ ఎస్ఐగా పని చేస్తున్న కేశవరావు జిల్లాలో ఏలూరు డిటిసిలో పని చేస్తున్న సమయంలో పోలీసు శాఖ సేవా పతకానికి ఎంపికయ్యారు. 2010లో హెడ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగోన్నతి పొందారు. పలు పోలీస్ స్టేషన్లలో ఆయన పని చేసిన అనంతరం 2013లో ఎఎస్ఐగా ఉద్యోగోన్నతి పొందారు. 2021లో ఎస్ఐగా ఉద్యోగోన్నతి పొందారు. ఆయన సర్వీసు కాలంలో నరసాపురం టౌన్, డొంకరయ్, తాడేపల్లిగూడెం టౌన్, ఉండి, జంగారెడ్డిగూడెం, ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ డిసిఆర్‌బి, పెదవేగి జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్లలో పనిచేశారు. ఆయన పలు రివార్డులు, అవార్డులు, నగదు పురస్కారాలు అందుకున్నారు. ప్రస్తుతం ఆయన ఏలూరు జిల్లా నుంచి కృష్ణా జిల్లా గన్నవరం ట్రాఫిక్ పోలీస్ బదిలీపై వెళ్లి అక్కడ పని చేస్తున్నారు.

తేజ సూరత్‌కు ఉత్తమ బిల్డింగ్ పురస్కారం

ప్రజాశక్తి - ఏలూరు


పురస్కారం అందుకుంటున్న తేజసూరత్

ఏలూరు చెందిన యువ ఇంజినీర్ శ్రీసోమ కన్‌స్ట్రక్షన్స్ కన్సల్టింగ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ తేజ సూరత్‌కు ఉత్తమ బిల్డింగ్ పురస్కారం లభించింది. విశాఖపట్నం సెంట్రల్ ఇండియన్ కాంక్రీట్ ఇన్‌స్టిట్యూట్ నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ఛైర్మన్ డాక్టర్ సిఎన్‌వి.సత్యనారాయనరెడ్డి, కార్యదర్శి కె.శ్రీనివాసరావు, కోశాధికారి జి.మాధురి ఇసి సభ్యుల ఆధ్వర్యంలో తేజ్ సూరత్‌కు 2023 ఐసిఐ ఆల్ట్రాటెక్ పురస్కారాన్ని అందించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి వరుసగా రెండోసారి ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

పేదల అభ్యున్నతికి జగన్ కృషి

వైసిపి చింతలపూడి ఎంఎల్‌ఎ అభ్యర్థి విజయరాజు

ప్రజాశక్తి - చింతలపూడి

పేద, బడుగు, బలహీనుల కోసం వైసిపి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందని వైసిపి చింతలపూడి ఎంఎల్‌ఎ అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. లింగపాలెం మండలం మఠంగూడెం గ్రామంలో మంగళవారం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో కంభం విజయరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి, విద్య, వైద్యం, ప్రజా సంక్షేమం వంటి వాటికి సిఎం జగన్ అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. పేదల శ్రేయస్సు కోరిన జగన్‌ను మళ్లీ గెలిపించుకోవాలన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ మందలపు సాయిబాబా, పార్టీ లింగపాలెం మండలాధ్యక్షుడు కొఠారి మోహన్‌రావు, వైస్ ఎంపిపి ఎం.సురేష్, సీనియర్ నాయకులు ముసునూరు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బహిరంగ వేలం పాటలు వాయిదా

ముదినేపల్లి : శింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లో ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మ ణ్యేశ్వర స్వామి వారి ఆలయం లో ఈ నెల 20 తేదీన నిర్వహించాల్సిన బహిరంగ వేలం పాటలను వాయిదా వేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య మంగళవారం తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉండడంతో వేలం పాటలను వాయిదా వేసినట్లు ఆమె తెలిపారు.